క్లుప్తంగా

విద్యార్థుల క్షేత్ర పర్యటన



మహమ్మద్‌నగర్ తండాలోని పట్టు పురుగుల కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా మండలంలోని మహమ్మద్ నగర్ తండాలోని పట్టుపురుగుల కేంద్రాన్ని సందర్శించారు. క్షేత్రస్థాయిలో విషయ సేకరణ, పరిశీలించటం, వాటి అధ్యయనాలు గురించి వివరించడం వల్ల విద్యార్థులకు అపారమైన ప్రయోజనాలు కలుగుతాయని ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థుల వెంట పాఠశాల ఉపాధ్యాయులు వెంకట స్వామి, శ్రీనివాస్ రావు, నరసింహారెడ్డి, అర్చన, చార్లెస్, నవనీత, శైలజ, జయసుధ, వాణిశ్రీ, విజయ్ మోహన్ రావు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

వెల్దుర్తి(తూప్రాన్): ట్వినింగ్ పాఠశాలల సందర్శనలో భాగంగా మంగళవారం వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 6వ నుంచి 9వ తరగతి విద్యార్థులు కుకునూర్, యశ్వంతరావుపేట్, అందుగులపల్లి తండా ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులు కుకునూర్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ను, గ్రంథాలయాన్ని సందర్శించడంతో పాటు అక్కడ జరిగే క్రీడలు, బోధన విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కుకునూర్ హెచ్‌ఎం సీతారాం, వెల్దుర్తి హెచ్‌ఎం సాంబయ్య ఉపాధ్యాయులున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, రోడ్డు నిబంధనలు సక్రమంగా పాటించాలని ఏఎస్‌ఐ మిస్బావుద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిట్కుల్ శివారులో పోలీసులు వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే, ఎదురుగా వచ్చే వారికి సైతం ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

చెరువుల్లోకి నీరు నింపాలి



నీరు నింపాలని చేగుంట-గజ్వేల్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

చేగుంట(తూప్రాన్): పంటల కోసం చెరువుల్లోకి కాల్వల ద్వారా నీటిని నింపాలని చిన్నశివునూర్‌తో పాటు కర్నాల్‌పల్లి గ్రామాల రైతులు మంగళవారం చేగుంట- గజ్వేల్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కాల్వల ద్వారా వచ్చే నీటిని తమ చెరువుల్లో నింపితే యాసంగి పంటలు గట్టెక్కె అవకాశం ఉందని తెలిపారు. తమ చెరువుల్లోకి కాల్వల నీటిని నింపేలా చూడాలని, అధికారులకు తెలిపినా పట్టించుకోక పోవడంతో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అధికారులతో మాట్లాడిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

టేక్మాల్ మార్కెట్ వేలం పూర్తి

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో ప్రతీ శనివారం జరిగే వారంతపు మార్కెట్ (సంత) వేలం మంగళవారం పూర్తయినట్లు ఈఓ రాకేశ్ తెలిపారు. టేక్మాల్ గ్రామానికి చెందిన మేకల మార్కెట్‌ను రూ.40లక్షలు, పశువులు మార్కెట్ రూ.20లక్షలకు టేక్మాల్‌కు చెందిన మతిన్ సొంతం చేసుకున్నారు. కూరగాయాల తైబజార్‌ను రూ.10.5లక్షలకు టేక్మాల్‌కు చెందిన చల్ల నర్సింలు సొంత చేసుకున్నట్లు తెలిపారు. వేలం పాటలో మార్కెట్‌ను దక్కించుకున్నవారు 24తేదీలోపు డబ్బులు పూర్తిగా చెల్లిస్తేనే మార్కెట్ బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు.

విరిగిన ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డు

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు ప్రభుత్వం డిజిటల్ తరగతులు, కంప్యూటర్ బోధనను ప్రవేశపెట్టింది. టీవీలతో పాటు ఫ్యానల్ బోర్డులు ఏర్పాటు చేశారు. నాణ్యత లేకుండా ఫ్యానల్ బోర్డు ఏర్పాటు చేయడంతో అది విరిగి పడటంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన అల్లాదుర్గం బాలికల జెడ్పీ పాఠశాలలో చోటు చేసుకుంది. డిజిటల్ విద్య కోసం టీవీతో పాటు ఐఎఫ్‌పీ ఫ్యానల్ బోర్డు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుడు బోధిస్తుండగానే ఫ్యానల్ బోర్డు విరిగి పడింది. ఫ్యానల్ బోర్డు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి బాగు చేయాలని చెబితే పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. ఇప్పటికైన అధికారులు ఫ్యానల్ బోర్డును బాగు చేయించి మరో సారి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిండని ట్యాంకులతో నీటి కష్టాలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో ట్యాంకుల్లో సరిపడా నీటిని నింపకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. చేగుంటలోని స్టేషన్‌రోడ్డు సప్తగిరి కాలనీ, బుడగజంగాల కాలనీ, సీఎంఆర్ కాలనీల్లో లక్షా 20 వేయిల లీటర్ల సామర్థ్యం గల భగీరథ వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వారం రోజులుగా ఈ ట్యాంకుల్లో భగీరథ సిబ్బంది నీటిని సక్రమంగా నింపడం లేదు. ప్రతీరోజు 20 నుంచి 40 వేల లీటర్ల నీటిని మాత్రమే ట్యాంకుల్లో నింపుతున్నారు. ఒక్కోరోజు నీటిని నింపకపోవడంతో ఆయా కాలనీల వాసులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని ఈ మూడు ట్యాంకులను భగీరథ సిబ్బంది పట్టించుకోక పోవడంతో నీటి కష్టాలు ఎదుర్కొంటున్నామని వారు పేర్కొంటున్నారు. భగీరథ నీరు రాని రోజుల్లో సీఎంఆర్ కాలనీ, బుడగజంగాల కాలనీ వాసులకు ప్రత్యామ్నాయ నీటి సౌకర్యం లేనందున భగీరథ సిబ్బంది ప్రతీ రోజు నీటిని సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నీటి ఇబ్బందుల గురించి పట్టించుకోకుంటే నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.



చేగుంటలోని స్టేషన్‌రోడ్డులోని ట్యాంకు

విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకం

ఎంఈఓ తారాసింగ్

నర్సాపూర్ రూరల్: విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని నర్సాపూర్ ఎంఈఓ తారాసింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి మార్కులు సాధించాలని సూచించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణ ఉన్నవాళ్లు జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీశైలం, ఉపాధ్యాయులు మల్లయ్య, శ్రీనివాస్ రావు, శేఖర్, శివ శంకర్, శ్రీనివాస్ మంజుల, సునీత, హైదర్, ఉపేందర్ గోపాల్, కృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

నల్లపోచమ్మ.. దీవించమ్మా..

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి అగ్నిగుండాలు, బోనాలు



జాతరలో అమ్మవారికి బోనాలతో భక్తులు



అగ్నిగుండాల నుంచి నడుస్తున్న మహిళ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మ జాతర మంగళవారం రెండో రోజు అగ్నిగుండాలు, బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు శివ్వప్ప అగ్నిగుండాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అగ్నిగుండంలో నడిచి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో బోనాలు ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. జాతర ఏర్పాట్లను తహసీల్దార్ ఆంజనేయులు పరిశీలించారు. ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌తో పాటు ఆలయ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాయాగౌడ్, మాజీ ఉపసర్పంచ్‌లు కొండల్‌రెడ్డి, శేఖర్, నాయకులు మానిక్యారెడ్డి గ్రామస్తులు అధికారులతో కలిసి భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చిలప్‌చెడ్ ఎస్‌ఐ నర్సింలు, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌తో పాటు డివిజన్‌లోని పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. భక్తుల పూజలతో ఆలయం వద్ద భక్తుల కోలాహలంగా మారింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి ట్యాంక్‌లను నింపారు.

చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రస్తుతం ఎండ తీవ్రతతో వరి పైరు ఎండిపోయి చీడపీడల తెగులు ఆశించే ఆస్కారం ఉందని మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. వరి పైరుని కాపాడుకోవాలంటే నీరు సమృద్ధిగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. నీటి ఎద్దడి ఉన్న పొలాల్లో ప్రత్యామ్నాయ తడులు అందేలా చూస్తూ పంటను కాపాడుకోవాలన్నారు. పంటకు ఏదైన చీడపీడలు సోకితే వ్యవసాయ సిబ్బందికి సమాచారం అందిస్తే పంటల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు మాజీద్ అలీ, రేవతి, వందన, ఉత్తం, తదితరులు ఉన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

నోటిఫికేషన్లు వర్తించేలా వర్గీకరణ చేయండి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి

మెదక్ మున్సిపాలిటీ: అన్నీ నోటిఫికేషన్లు వర్తించేలా చట్ట ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో నాలుగు రోజులుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల సాక్షిగా వర్గీకరణకు చట్ట భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాల్‌రాజ్, శేఖులు, వెంకటి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న నాయకులు

ముగ్గురు వ్యక్తుల రిమాండ్

నర్సాపూర్‌రూరల్: అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ లింగం మంగళవారం తెలిపారు. మండలంలోని ఎల్లాపూర్ గ్రామంలో ఇటీవల అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు అదే గ్రామానికి చెంది అనిల్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలి

అల్లాదుర్గం(మెదక్): పదో తరగతి విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అర గంట ముందుగానే చేరుకోవాలని ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి చెప్పారు. మంగళవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు మండి పోతున్నాయని, గంట గంటకు మంచి నీళ్లు తాగాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు ఫోన్లు, ఎలక్ట్రికల్ వస్తువులు తీసుకురావొద్దన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎవరు అక్కడ ఉండకూడదని తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రామాయంపేట(మెదక్): పదో తరగతి పరీక్షలు 21 నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పరీక్షల నిర్వాహణకు మండల పరిధిలోని ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 752 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అన్ని కేంద్రాలవద్ద తాగునీరు, ఫర్నిచర్, టాయిలేట్ల సదుపాయం కల్పించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

పటిష్ఠ బందోబస్తు

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పదోతరగతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ పోచయ్య తెలిపారు. పదోతరగతి విద్యార్థులు పరీక్షా కేంద్రానికి 15 నిమిషాల ముందే చేరుకోవాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

కొత్తపేటలో పంపుసెట్లు చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): వ్యవసాయ పొలం వద్ద ఉంచిన బోరుబావి మోటార్లు, ఇతర సామగ్రి చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని కొత్తపేటలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సత్యనారాయణ, రాంరెడ్డిలకు చెందిన పంపుసెట్లు కాలిపోవడంతో బోరుబావుల్లో నుంచి తీసి పొలం వద్దనున్న గదిలో భద్రపరిచారు. ఆదివారం అర్ధరాత్రి పలువురు వ్యక్తులు రాంరెడ్డికి చెందిన 5 హెచ్‌పీ మోటార్, సత్యనారాయణకు చెందిన మోటారు, పంపు, ఇతర వ్యవసాయ సామగ్రి చోరీ చేశారు. చోరీకి పాల్పడిన ఆరు మంది అనుమానిత వ్యక్తుల పేర్లతో బాధిత రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆలయ నిర్వహణ కోసం నిధి ఏర్పాటు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గూడూర్ గ్రామంలో కొలువైన పురాతన పార్వతీ సోమేశ్వరస్వామి ఆలయ నిర్వహణ కోసం మూలధనం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఆలయ అర్చకుడు శాస్త్రుల రాజశేఖరశర్మ అన్నారు. వందల ఏళ్లనాటి ఆలయ పరిరక్షణకు రూ.8 లక్షలు దేవాలయం పేరిట బ్యాంకులో డిపాజిట్ చేసి, నిత్యం దీపదూప, నైవేద్యం పూజలు నిర్వహించిందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులు, దాతల సాయంతో ఆలయం వద్ద పలు అభివృదిద్ద పనులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాపన్నపేట(మెదక్): మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జనుముల దుర్గవ్వ(48) మతి స్థిమితం సరిగా లేకపోవడంతో క్రిమి సంహారక మందు తాగి వాంతులు చేసుకోగా, ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె కుమారుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సంగన్న తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయస్వామి దర్శనం అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డిని సన్మానించిన కమిటీ సభ్యులు



కౌడిపల్లిలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న మాధవానందస్వామి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ఆంజనేయ స్వామి, నవగ్రహాల విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ పురోహితులు రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు గణపతిపూజ, హోమం నిర్వహించారు. ఆలయ నిర్మాత మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి భార్య సుజాత పూజల్లో హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పద్మ, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, నాయకులు సత్యనారాయణ, పురుషోత్తం, శాఖయ్య, మోతిలాల్‌గౌడ్, చంద్రం, శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు చేసిన ఎమ్మెల్యే

మండలంలోని కొట్టాలలో ఆంజనేయస్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే ఆలయానికి రావడంతో గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్, మాజీ ఎంపీపీలు రాజు, రుద్రప్ప, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, మండల మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు దుర్గారెడ్డి, గౌరిరెడ్డి, రమేశ్‌గౌడ్, కాంతారావు, శ్యాంసుందర్‌రావు, కిషోర్‌గౌడ్, లింగం, మనోహర్‌రెడ్డి, మదవరెడ్డి, నవీన్, సందీప్, రవిసాగర్, తదితరులు పాల్గొన్నారు.

కాళ్లకల్‌లో ఉచిత వైద్య శిబిరం



ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మనోహరాబాద్(తూప్రాన్): రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కాళ్లకల్ గ్రామంలో మంగళవారం ఉచితవైద్య శిబిరాన్ని రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీఎస్టీ పరిశ్రమ సహకారంతో మల్లారెడ్డి ఆస్పత్రి సిబ్బందితో స్థానికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ నత్తి మల్లేశ్, నాయకులు రవి, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర సభ్యులు సింగం శ్రీనివాస్‌రావు, కార్యదర్శి సుభాష్, చంద్రబోస్, వైస్ చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, కోశాధికారి శ్రీనివాసశర్మ, మేనేజ్‌మెంట్ సభ్యులు , మల్లారెడ్డి వైద్య బృందం, పీహెచ్‌సీ వైద్యులు జ్యోత్స్నదేవి, వైద్యులు ప్రియాంక, సమంత, సీఎస్‌ఓ బాల్‌నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

జాతరలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల స్వచ్ఛభారత్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి జాతరలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మంగళవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కంది వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మండలంలోని తునికిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న పంటలు, కూలీల కొరత తదితర అంశాలను సర్వే చేశారు. అనంతరం తునికి నల్ల పోచమ్మ జాతరలో ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు హరి, రమేశ్, నిలంచిక, ఈఓ రంగారావు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఏకగ్రీవంగా విశ్వకర్మ సంఘం కమిటీ



విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ప్రతినిధులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

నర్సాపూర్: నర్సాపూర్ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడిగా నరేంద్రచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమ సంఘం ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌చారి, ఉపాధ్యక్షుడిగా కాళిదాస్‌చారి, సహాయ కార్యదర్శిగా మహేశ్‌చారి, కోశాధికారిగా అంజయ్యచారిలతో పాటు పలువురు ఆయా పదవులకు ఎన్నికయ్యారని వివరించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులను శాలువాలతో సన్మానించారు. ఎన్నికల కార్యక్రమంలో సంఘం జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి కృపాచారి, ఇతర నాయకులు భాస్కర్‌చారి దయానంద్ చారి, లింగంచారి, శివరాజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

పెద్దశంకరంపేట(మెదక్): దివ్యాంగులు ఆధైర్యపడొద్దని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని మండల ఎంఈఓ వెంకటేశం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష- ఆలిమ్‌కో ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారికి ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ ప్రసన్న లక్ష్మి, ఐఈ ఆర్పీ రవి కిరణ్, రాజు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సంపత్‌రెడ్డి, సంగమేశ్వర్, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



వీల్ చైర్స్ అందజేస్తున్న ఎంఈఓ వెంకటేశం

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

వెల్దుర్తి(తూప్రాన్): ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు అని ఎమ్మెల్యే సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. మండలంలోని మానెపల్లిలో పెద్దమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాలకు వారు వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అతిథులను శాలువాతో సత్కరించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, రాములు, స్వామి, భూపాల్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



బోనాల ఊరేగింపులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, తదితరులు

సంక్షిప్త వార్తలు

◆ నిత్యావసర వస్తువుల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొత్తచెరువు తండా పంచాయతీ గూగ్లోత్‌తండాకు చెందిన లక్ష్మణ్ గత ఆదివారం చెరువులో మునికి మృతి చెందాడు. దీంతో మంగళవారం అదే పంచాయతీకి చెందిన మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మూడ్ దన్‌సింగ్, శంకర్ బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు, మహమ్మద్‌నగర్ మాజీ సర్పంచ్ దివ్యమహిపాల్‌రెడ్డి రూ. 3వేలు నగదు పంపిణీ చేశారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పులిమామిడి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెండాల సునీల్(28) ఈనెల 12న బైక్‌పై దౌల్తాబాద్ వెళ్తుండగా బోనాల గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న టీవీఎస్ మోపెడ్ సునీల్ బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సునీల్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సునీల్ మంగళవారం మృతి చెందగా మృతుడి భార్య భవానీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించి పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంఈఓ నీరజ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రఘుపతి, ఉపాధ్యాయులు రాజేశ్వర్, లక్ష్మణ్, వెంకటేశ్, సుధాకర్‌రెడ్డి, రాధ, రమాదేవి, సరస్వతి, ఉమా, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

◆ క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థి దశనుంచే క్రమశిక్షణతో విద్యనభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాసాయిపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ధర్మపురి విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని 1999–2000 బ్యాచ్ పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు కలిసి మంగళవారం పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు ఇతర పరీక్షా సామగ్రిని అందజేశారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి విగ్రహం వద్ద పూజలు నిర్వహించి విద్యార్థులకు హాల్ టికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ యూనివర్సిటీల్లో ఎన్నికలు నిర్వహించండి

పాపన్నపేట(మెదక్): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో సంఘం ఎన్నికలను నిర్వహించాలని కోరుతూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాసినట్లు మంగళవారం తెలిపారు.

◆ బురద రంగులో భగీరథ నీరు



చేగుంట(తూప్రాన్): మండలంలోని పెద్ద శివునూర్ గ్రామంలో బురద రంగులో భగీరథ నీరు వచ్చాయి. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా గ్రామంలో మిషన్ భగీరథ నీరు రాకపోగా మంగళవారం ఉదయం నీటిని వదిలారు. వచ్చిన కొద్దినీరు బురద రంగులో రావడంతో వాటిని ఎలా వాడుకోవాలని గ్రామస్తులు తెలిపారు. వేసవిలో నీటి ఇబ్బందులు ఉంటాయని తెలిసినా.. సంబంధిత అధికారులు నీటిని సక్రమంగా పంపిణీ చేయకపోగా రంగు మారిన నీటితో ప్రజలు అనారోగ్యం పాలైతే బాధ్యులెవరని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో శుద్ధమైన నీటిని సరఫరా చేయకుంటే మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తామని గ్రామస్తులు చెప్పారు.

◆ సమయస్ఫూర్తితో పరీక్షలు రాయాలి

వెల్దుర్తి(తూప్రాన్): పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా సమయస్ఫూర్తితో పరీక్షలు రాయాలని మానెపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కౌసల్య విద్యార్థులకు సూచించారు. మంగళవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.